
మెరిసేదంతా మేలిమి కాదన్నట్టు- దర్జాగా 'జ్యూయలరీ మారు' ముందు వాహనం దిగిన వాళ్ళంతా మంచి కష్టమర్సు కాదని సేట్ ఆనందయ్యకు తెలుసు. పురుషుల్లో పుణ్య పురుషులు వేరుకదా ?

# జగమే మాయ

## ఎమ్. డి. సౌజన్య




అయితే ప్లిమత్ కారులో సోఫియా లారెన్‌లా దిగి, ఫారిన్ హై హీల్స్ షూసు లయబద్ధంగా టకటక లాడిస్తూ హంసలా నడిచి నల్ల ముసుగుతో ఆపాద మస్తకం కప్పకుని తనెవరో తెలియకుండా, తన నెవరూ చూడకుండా, తను అందరినీ చూస్తూ వచ్చే వనితలంటే ఆనందయ్య ఒక ప్రత్యేక గౌరవం!!

ఏ కష్టమరు ఏమిటో అది వందల బేరమో, లకారాల బేరమో, ఆ వచ్చిన కష్టమరు స్థాయి ఏ పాటిదో, రాక్షసుడు నరవాసన పసిగట్టినట్టు పసిగట్టగలడు ఆనందయ్య. అందుకే అంతవరకు శ్రీ యిన్ వన్ మినీ ఫెదర్ టివిడ్ ఫారిన్ షేవరికార్డరులో తన గొంతే తను షేవ్ చేసుకుని ఆనందిస్తున్న వాడు- షేవ్ రికార్డరు చేయటానికి ఆన్ చేసి వున్న సంగతి మరచి "ఆయియే.... తష్రీఫ్ ఆయియే!" అన్నాడు హైద్రాబాద్ సాంప్రదాయంలో వ్యాపారిగా ఆహ్వానిస్తూ.

మామూలుగా అయితే క్యాష్ కౌంటర్‌లో సేట్ ఆనందయ్య బంగారు నటరాజు విగ్రహం బ్యాక్ డ్రాప్‌గా శివాలయంలో నందిలా కూర్చుని వుంటాడు.

అతను కూర్చునే గాద్రేజ్ కుర్చీలో రోడ్ రోలర్ లాంటి అతని శరీరం మామూలు పాటి బేరాలకు కదలదు.

అంతవరకు ఏ భావం పలకని అతని ముఖంలో ఎక్కడ లేని వినయ విధేయతలు, నమ్రత, ఆప్యాయత సాక్షాత్కరించాయి.

ఇలాంటి ఆర్ట్-ఆర్టిస్టిక్ ఎక్స్‌ప్రెషన్సు క్షణాల్లో ముఖంలో, అతి సహజంగా పలికించడం అతనికి నల్లేరుపై ఏళ్ళుగా వున్న వ్యాపార లక్షణమే!! కస్టమరు స్థాయి ఏ పాటిదో అంచనా వేయటానికి చూశాడు గోల్డుకలర్ రిమ్‌లెస్ కళ్ళజోడులో నుంచి. గద్ద కోడిపిల్లను తన్నుకు పోవటానికి పొంచి చూసే చూపులాంటి చూపది.

అది మేరేజ్ సీజను కావడం వల్ల ఆనందయ్య వూహించాడు- ఆ లలనా

మణిది 'అకారాల' బేరం అయి వుంటుం దని.

"అప్‌కో క్యా క్యా చాహియే?" [తమకు ఏమేమి కావాలి?] అడిగాడు ఆనందయ్య లేచి నిలబడి వినయంగా.

పెద్ద మేజర్ జనరల్ ముందు మామూలు సిపాయి భయభక్తులు ప్రదర్శిస్తున్నట్లుంది అతని వాలకం.

అంత వరకు తెరలా వున్న ముసుగు తొలగించి "రవ్వల నెక్లెసులు రెండు కావాలి" అంది తన విజిటింగు కార్డు అతని ముందుకు నెట్టింది ఆ అందాల భామ.

'ఆషామాలిని, సినీ యాక్ట్రెస్, మెరైన్ డ్రైవ్, బొంబాయి' అనే అడ్రసు చదువుకుని అది కలో వైష్ణవమాయో అర్థంకాక మిడిగుడ్లు వేసుకుని అలాగే చూడసాగాడు ఆనందయ్య ఆమె రూప లావణ్యాన్ని.

అరుదయిన, అపురూపమైన స్వీటులన్నీ ఒకేచోట అద్దాల బీరువాల్లో మొదటిసారి చూసిన పల్లెటూరి పిల్లవాడి వాలకంలా వుంది-అతని వాలకం.

దేవలోకపు దారి తప్పి భూలోకం వచ్చిన అప్సరసలాంటి ఆ అమ్మాయి అతిలోక సౌందర్యం చూడగానే-పివ్వళ్ళ బస్తాలా కదల్లేక, నీటి గుర్రంలా వళ్ళు అంతా కండలు వ్రేలాడుతూ, ముక్కు మీద ఎప్పుడు కోపంతో ఖడ్గమృగంలా వుండే సేట్ ఆనందయ్య భార్య ఆ క్షణంలో గుర్తొచ్చింది.

పాతకాలపు నవాబుగారి దివాణం తాలూకు స్త్రీలు ఇంత అందమైన వాళ్ళు వుంటే వుండే వారేమో. కాని- బొంబాయి హిందీ హీరోయిన్లలో ఇంత అందమైన వాళ్ళుంటారని తెలిస్తే తను హిందీ సినిమాలు వదలకుండా చూసేవాడు. కాని అవి చూడనందుకు ఇప్పుడు బాధపడసాగాడు.

ఈవిడ ఏ సినిమాల్లో హీరోయినో తెలియదు....! అదే విషయం అడిగితే తనొక వాజమ్మ అనుకోదూ? పైగా ఈ రోజుల్లో సినిమాలు- అర్థం కాకపోయినా హిందీ, ఇంగ్లీషు చూడడం ఒక పెద్ద ఫ్యాషను!

అవి చూడనివాడు-ఆటవికుడు- అనాది మానవుడికంటే అనాగరికుడి కిందే లెక్క.

"సేట్ జీ! నేను హిందీ ఫిల్ము హీరోయినయినా హైదరాబాద్ ప్రాంతాల్లో ఔట్ డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ వుండటం వల్ల ఎప్పుడో ఇచ్చిన ఆ కాల్ షీట్లు పూర్తి చేయటానికి వచ్చాను" అంది.

సేట్ ఆనందయ్య అచేతనావస్థ నుంచి చేతనావస్థలోకి వచ్చి "బాయ్! కూల్ డ్రింక్.... లావో!" అని సేట్ అరుస్తుంటే అతన్ని వారించి 'ఉష్'— అల్లరి చేయకు అన్నట్టుగా సైగ చేసి "ఆ పని మాత్రం చేయకండి. రేపు నాకు బొంబాయిలో డబ్బింగ్ చెప్పాల్సిన పని వుంది. కూల్ డ్రింక్స్ త్రాగితే గొంతు దెబ్బ తింటుంది. పైగా కాస్త ఫిగర్ మెయింటైన్ చేయటానికి డైటింగ్ చేస్తున్నాను" అంది ముత్యాల్లాంటి పలువరుస అందంగా కనిపించేట్టు నవ్వుతూ.

హిందీ ఫిల్ము హీరోయిన్లంటే లక్షల్లో తెలుపు నలుపు- లకారాలు చూస్తుంటారని వినికిడి.

"ఇదేదో పెద్ద కేసే.... కాస్త జాగ్రత్తగా.... లాభాలు గుంజాలి!" అనుకున్నాడు సేట్.

"మీ జ్యూయలరీ మార్టులో రవ్వల నెక్లెసులు దొరుకుతాయని.... ఇందాకే వారధి స్టూడియోలో తెలుగు హీరోయిన్లు పంకజం, చంపకం, మధులత దీపలక్ష్మి చెప్పారు. పై వారమే మా సిస్టర్ మేరేజ్ ఒక కువాయిట్ 'షేక్'తో ఫిక్సవ్ అయింది....! ఓ లక్ష మీరు అదనంగా తీసుకోండి. బిల్లు ఏదైనా పర్వాలేదు. సిలోన్ సరుకు సంగతి చెప్పారులెండి" అంది ఆషామాలిని.


స్మగుల్డ్ సిలోన్ సరుకంటే ఫిఫ్టీ ఫిఫ్టీ ప్రాఫిట్.


పైగా ఏ బిల్లయినా ఫర్వాలేదంటోంది ఆషామాలిని- ఎంత బిల్లు వేసినా లెక్కలేని బేరం. ఆనందయ్యకు ఆనందంతో స్వర్గలోకాలలో విహరిస్తున్నట్లుంది.

ఇంతలో ఫోన్ మ్రోగింది. "హలో" అన్నాడ సేటు.

"నేను సెంట్రల్ బ్యాంకు మేనేజర్ షర్‌ఫుల్‌హక్‌ని మాట్లాడుతున్న. ఇప్పుడే మా బ్యాంకులో అరవై లక్షలు వేసి ఎకౌంటు తెరిచిన హిందీ నటి ఆషామాలిని రవ్వల నెక్లెసు కొనాలంటే పెద్ద డినామినేషను నోట్లు వందల కట్టలిచ్చా. బైదిబై నగలు కావాలంటే ఆనందయ్య జ్యూయలరీ మార్ట్. అబిడ్ సెంటర్ పేరూ చెప్పాను. ఎవరో కువాయిటు షేక్‌ని పట్టినట్టుంది హీరోయిన్.... మీ యమౌంట్స్ ఏమైనా జమ చేసేవి వుంటే ఇంకో పావుగంటలో పంపండి!" అన్నాడు.

ఆనందయ్య ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఆ మాటలతో సింగపూర్ స్మగ్లింగ్ రవ్వల నెక్లెసు అంటే వొక్కొక్కటి మూడు లక్షలకు తక్కువ వుండదు. రెండు నెక్లెసులంటే- ఆరు లక్షలు ఎంతహీనంగా చూసుకున్నా రెండు లక్షలు లాభం! పైగా స్మగ్లింగ్





సరుకుకోసం బినామిగా వాడే బిల్లు బుక్కు వేరే వుంది. కాబట్టి ఇందులో అనుమానించాల్సిన. భయపడవలసిన సంగతేమీ లేదు- ఆలోచించాడు ఆనందయ్య.

"సేటుజీ! నాకు ప్లేనుకు టైమవుతోంది త్వరగా వెళ్ళాలి. ఈ బొంబేఫ్లయిట్ మిస్సయిందంటే-రేపు నా నిర్మాతలు నష్టపరిహారం క్రింద నా మీద కోటి రూపాయల దావా వేస్తారు. నాకు మీసంగతి తెలుగు హీరోయిన్లంతా చెప్పారు. ఇదిగో మీరు వాళ్ళకిచ్చిన బిల్లు. ఇది దీపలక్ష్మి ఇచ్చింది. మూడు లక్షలు ఛార్జ్ చేశారట కదా! నాకు రెండు నెక్లెసులు కావాలి. ఇదిగో ఆరు లక్షలు. లెక్కపెట్టుకోండి. ఇప్పుడే సెంట్రల్ బ్యాంకు నుంచి డ్రా చేసి తెచ్చాను. మా కాబొయే బావగారు ఓ కువాయిటు షేక్‌గారు- మా అక్కయ్యకు నాకు ఇచ్చే ప్రెజెంటేషనులు ఈ రవ్వల నెక్లెసులు" అంది చిలిపిగా చూస్తూ నవ్వి.

నోట్ల కట్టలు చూశాడు ఆనందయ్య. ఆషామాలిని చెప్పినట్టే అవి సెంట్రలు బ్యాంక్ లేబిలుతో, ట్వయిన్ దారాలు చుట్టి- ఏ కట్టకు ఆ కట్ట బొత్తిగా వున్న ఆరు లక్షల కొత్త నోట్లు.

ఒక కట్ట తీసి పిన్నింగ్ వేసి వున్నది వున్నట్టుగానే వుంచి ఒక నోట్ తీసి రిజర్వ్ బ్యాంకు గవర్నర్ సంతకం ట్రాన్స్‌పరెంటు త్రెడ్ లైన్, వాటర్‌మార్క్‌డ్ మూడు సింహాలు అశోకచక్రం. సీరియల్ నంబర్లు చూశాడు. అనుమానం లేదు. అవి మంచి నోట్లే. ఆనందయ్య కళ్ళు మోసపోవు!

"ఇప్పుడే సెంట్రలు బ్యాంకు నుంచి మా కువాయిట్ బావగారు డ్రా చేశారని చెప్పాగా. మీరు ఫోను చేసి కనుక్కోండి. అభ్యంతరం లేదు. ఇదిగో నా చెక్ బుక్ ఇందులో ఇప్పుడెంత డ్రా చేశానో చూడండి. బ్యాంక్ మేనేజరు షర్‌ఫుల్ హక్‌గారు రవ్వల నెక్లెసుల కోసం మీ షాపు పేరే రికమెండ్ చేశారు" అంది పాస్‌బుక్ సేటుగారి ముందు పడేస్తూ.

సేటు మర్యాద కోసం "అబ్బే! అవసరం లేదమ్మా! మీ వంటి వారిని అనుమానిస్తే.... మమ్మల్ని మేము అనుమానించుకున్నట్టే గదా?" అన్నాడు ఇంటర్‌కమ్‌లో స్మగుల్డ్ సరుకు తెమ్మనమని గుమాస్తా గురవయ్యకి చెబుతూ.

గుమాస్తా గురవయ్య నిముషాల్లో అక్కడ లెదర్ కేసుతో ప్రత్యక్షమవుతుండగా ఆషామాలిని తన ముఖం కనిపించకుండా మేలిముసుగు తెరలా దించుకుంది.

సేటు విషయం అర్థమైనట్టు గురవయ్యని అక్కడి నుంచి పంపి "చూడండి మిస్.... సెంట్ పర్సెంటు గ్యారంటీ రవ్వలు. సిలోన్ స్మగుల్డ్ సరుకంటే.... ఈ జంట నగరాల్లో మరెక్కడా దొరకదు ఇవి మీరు ప్రపంచంలో ఎక్కడ కట్ చేసుకున్న క్వాలిటీ తేడా వుండదు. ఇవి చూసి మీ హిందీ ఫీల్డంతా ఎగబడక పోతే అప్పుడననండి" అన్నాడు—గుండ్రటి పెద్ద అద్దం వున్న పోర్టబుల్ స్టాండ్ ఆమె ముందు పెట్టి.

ఆషామాలిని తన మెడ చుట్టూ వున్న ముసుగు తొలగించి తన లోనెక్ జాకెట్ బయట పడేట్టు సుతారంగా ఆ రవ్వల నెక్లెసు మెడలో వేసుకుని అద్దంలో చూసుకుంది.

అసలే సున్నితంగా వున్న నున్నటి మెడ ఆ రవ్వల నెక్లెసుతో మరింత కొత్త అందాలు సంతరించుకుని 'పగలే వెన్నెల' అన్నటు మెరిసి పోతోంది. మేలిమి బంగారంతో మేలిమి బంగారమే పోటీ పడ్డట్టుంది.

ఆషామాలిని ఆనందయ్య వయిపు సంతృప్తిగా చూసి నవ్వి "ఓకే.... ఇక బిల్లు వ్రాయండి. నాకు ప్లేనుకు టైమవుతోంది" అంది. చిలిపి నవ్వులు ముసిముసిగా నవ్వుతూ

సేటు ఇక బినామీ బిల్లు తయారు చేసుకొని వస్తూ రెండు రవ్వల నెక్లెసులు పెట్టుకోడానికి రెండు మకమల్ జ్యూయలరీ బాక్సులు తెచ్చి ఇచ్చాడు.

"ఇక్కడ మీ పేరు, అడ్రసు రాశాను" అన్నాడు సరకులో పాటు బిల్లు కూడా అందించాడు.

క్షణాల్లో ఆషామాలిని లేచి నిలబడి "థ్యాంక్యూ" అంది-

పోర్షన్ అయిపోయి పాత్ర నిష్క్రమించటానికి సిద్ధమైనట్టు, మెరుపు తీగలా ఆషామాలిని వెళ్ళిపోతుంటే ఆమె హంస నడక, నల్లటి ముసుగులో లీలగా కనిపిస్తూ నాగుపాములా లయబద్ధంగా ఊగుతున్న జడ, క్రమబద్ధంగా టకటక లాడుతున్న హైహీల్సు, ఎంత జరుడిలోనైనా కోర్కెలు రేపే ఆమె అంగాంగం చూస్తూ వూహించుకుంటూ రాతిబొమ్మలా నిలబడి పోయాడు సేటుజీ.

కాస్సేపట్లో గుమాస్తా గురవయ్య వచ్చి "సేట్" అనగానే చూసి లెంపకాయ కొట్టాలనిపించింది. కోపంతో వళ్ళు మండిపోయి "ఏరా? ఏం కొంప మునుకుని పోయిందని అలా అరిచావు?" అన్నాడు పళ్ళు పటపట కొరికి.

గురవయ్యకు అర్థం కాలేదు. సేటుకు అంత కోపం ఎందుకు వచ్చిందో. తరువాత సేటు తెప్పరిల్లి—

"ఏరా.... ఆషామాలిని నటించిన సినిమాలు ఏం చూశావురా?" అని అడిగాడు.

గురవయ్యకు హిందీ సినిమాల పిచ్చి వుందని సేటుకు తెలుసు.

"చూడలేదు సార్!" అన్నాడు గురవయ్య.

# దీపకళిక



దీక్ష నిండిన గోరంత దీపమైన
కొండలకు వెల్గు నిచ్చునో కువలయాక్షి
కనుక వెలిగింపు మీ దీపకళిక నిపుడు
కారు చీకటి గములెల్ల పారిపోవ ।

మారుతా హతి జేసితా నారిపోవు
ననుచు భావింపవలదు కళ్యాణి । ప్రాణ
వాయువుల కాలవాలమై వరలుక తన
ప్రజ్వలింపగ జేయు దీపంబు నదియ ।

ముదురుటంథ తమస్సులో మునిగిపోయి
కుములుచున్నట్టి మానవకోటి కెల్ల
సొంపులీనెడు వేగురు చుక్కవోలె
కాంతి వెదజల్లు నొక దీపకళిక సఖియ !

చిక్క చీకటి కోనలో జిక్కియుండి
భయము పడినంత సుంతలాభంబు లేదు
కేవలం బొక్క దివ్వె వెల్గింతు వేని
చెలియ । చీకటి పొరలెల్ల చెదరిపోవు ।

ఈ ప్రయత్నంబులో జగమెల్ల నేడు
లీనమైయుండి విద్యుత్తు లీను చుండె
వలవదనుకొన్న నీ యమవసను నిండు
పున్నమిని నిల్పగలర టె పువ్వుబోడి ।

—ఎం.పి. జానుకవి

ఇంతలో చిన్న గడ్డం సవరించుకుంటూ "ఆదాబ్ సేట్ జీ" అంటూ షర్ పుల్ హక్ అక్కడికి వస్తూ అభివాదం చేశాడు.

సేఠ్ ఆయనవైపు కాస్త ఆశ్చర్యంగా చూస్తూ "మేనేజర్ సాబ్! మీరు ఆషామాలినిని మా జ్యూయలరీ మార్ట్‌కు పంపినందుకు షుక్రియా! గురువయ్యా! సాబ్‌కి ముందు రెండు దూద్ పేడా స్వీట్ తెచ్చి ఇవ్వరా!" అన్నాడు. ఆర్డరు వేస్తూ గురువయ్య ఆ పనిమీద వెళ్ళగానే. "ఏమిటి సేఠ్ జీ! నేను ఆషామాలినిని మీ షాప్‌కు పంపటం ఏమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు విషయం అర్థంగాక.

ఈ సారి సేఠ్ జీ వంతయింది, ఆశ్చర్య పడటం!

"ఇందాక మీరు ఫోన్ చేసి.... ఆషామాలిని తరపున వచ్చిన షేక్ ఎవరో అరవై లక్షల మొత్తంతో ఎకౌంట్ తెరిచారని రవ్వల నెక్లెస్ కొనాలంటే. పెద్ద డినామినేషన్ యమౌంట్ ఇచ్చి మా షాపుపేరు రికమండ్ చేశానని ఫోనులో చెప్పారు గదా?" అన్నాడు. ఆనందయ్య

"ఏమిటి ఆనందయ్యగారూ! ఏమిటి మీరు చెప్పేది.... !?"

"నేను ఇప్పుడే ఒక రొంపిలోనుంచి బయటికి వస్తున్నాను. నేను ఎవరికీ ఫోన్ చేయలేదే!" అన్నాడు. ఆశ్చర్యం అణచుకోలేక.

ఆనంతయ్యకు ఆ మాటలతో ఏదో అనుమానం వేసి.

"అయితే ఈ వంద రూపాయల నోట్లు కూడా మీ ఆఫీసువి కావా?" అన్నాడు. ఆ షామాలిని ఇచ్చిన ఒక కట్ట ఇచ్చి షర్ పుల్ హక్ ఆ కట్ట అటు ఇటూ తిప్పి చూసి.

"ఈ కట్ట మీ దగ్గరికెలా వచ్చింది?" ఆశ్చర్యం, భయం, తన మాటల్లో ముప్పిరిగొనగా అడిగాడు.

ఏదో కొంప మునిగిందనే భయంతో ఆనందయ్య "కొంపతీసి ఇవి దొంగ నోట్లు కాదు గదా!?" అన్నాడు.

"దొంగనోట్లు కాదు....! దొంగిలింపబడ్డ నోట్లు! మొన్న శనివారం మా బ్యాంకు స్ట్రాంగ్ రూములో వదిలక్షలు మాయమైంది!! నేను ఆ రోజు సెలవులో వున్నాను. ఇవ్వాళ సోమవారం పోలీసులకి ఉదయమే కంప్లయింట్ ఇచ్చాను. డ్యూటీలోకి చేరగానే! ప్రొద్దుటి నుంచి మా బ్యాంకు పోలీసు కంట్రోల్‌లో వుంది! మిస్సయిన నోట్లు ఇవే! ఎవరిచ్చారు ఈ నోట్లు!" అడిగాడు షర్ పుల్ హక్.

అవి దొంగిలింపబడ్డ నోట్లనడం-పైగా ఈ విషయం డైరెక్టుగా బ్యాంకు మేనేజర్‌కే చెప్పటంతో సేఠ్ ఆనందయ్య ఇరుకునపడ్డాడు

అన్ని దొంగిలించబడ్డ నోట్లు బయట పెట్టకుంటా తను ఏం చేయాలి! పైగా, తను ఇప్పుడు చెప్పక పోయినా- పోలీసులు తన చేత తరువాతయినా నిజం చెప్పిస్తారు. పైగా తను సిలోన్ నుంచి స్మగుల్డ్ చేసి తెచ్చిన రవ్వల నెక్లెస్ బినామీ బిల్లుతో అమ్మాడు....! ఏం చేయాలి!! !! ఖర్మ... ఖర్మ....! ఆలోచనల్లో పడి పోయాడు ఆనందయ్య!

కుడితిలో పడ్డ ఎలుకలా అయ్యింది—ఆనందయ్య పని! ఆ షామాలిని సంగతి చెప్పాడు సేట్ ఏడుపు గొంతుతో. షర్ పుల్ హక్ అతని మాటలు నమ్మక 'మీరు చెప్పేది నిజమేనా?' అన్నట్టు చూడ సాగాడు సేట్ వైపు. సేట్‌కి మొదటి సారి జీవితంలో- పసి పిల్లవాడు భూతాన్ని చూసి జడుసుకున్నట్టు జడుసుకున్నాడు!

"ఆషామాలిని...., అనే పేరుతో ఇండియాలో అసలు ఏ నటీమణీ లేదు! హిందీలో కూడా ఎవరూ లేరు! సేట్! నువ్వు వ్యాపారాలు రక రకాలవి చేస్తావని తెలుసు! కాని చివరికి బ్యాంకుకి కన్నం

వేసినవాళ్ళతో సైతం చేతులు కలుపుతానని కలలో కూడా అనుకోలేదు।" అన్నాడు. కుండ బద్దలు కొట్టినట్టు. ఆ మాటల్లో 'స్నేహం'- లేదు। అసలే। మూలుగుతున్న వాడి మీద మరో రాయి పడ్డట్టు- సేట్ ఆ మాటలతో వణికిపోతూ 'అయితే.... ఆ పేరుతో హిందీ నటీమణి బొంబాయిలో ఎవరూ లేరా?' అన్నాడు. అమాయకంగా పసి వాడిలా బిత్తర పోయి.

"పేరు....। సరే ... ఆమె నీకిచ్చింది ఎన్ని లక్షలు?" అడిగాడు షర్ పుల్ హక్ తనే పోలీసు ఐ. జి. అయినట్టు।

మరో మార్గం లేదు.... యివ్వక తప్ప లేదు। అందుకే సేట్ ఆ డబ్బు ఇచ్చి— "నాకిచ్చింది ఆరు లక్షలే।" అన్నాడు. చెంపలు వేసుకుంటూ.

"సరే అసలు విషయం చెబుతున్నా విను। మా బ్యాంకు సిబ్బంది కుమ్మక్కయిందో- లేక బయట వారే చేశారో మొత్తానికి పది లక్షలు స్ట్రాంగ్ రూం నుంచి మాయమైంది. దాని తాళం నాదగ్గర వుంటుంది। ముందు నేను నాలుగు లక్షలు- ఈ ఆరు లక్షలతో పాటు కడితేనే నాఉద్యోగం నిలబడేది। ఇప్పుడు మొత్తం పది లక్షలు ఇవ్వక పోతే ఇక్కడే వుండి పోలీసులను పిలిపించి, నిన్ను ఇరికిస్తాను।" అన్నాడు కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ.

సేట్ వణికి పోయాడు. మొత్తం పది లక్షలనేసరికి। కాని — షర్ పుల్ హక్ అన్నంత పనీ చేస్తే.... డబ్బుకు డబ్బూ పోయి—శని చుట్టుకున్నట్టవుతుంది।।అసలే స్మగుల్డ్ వ్యాపారం—బినామి బిల్లులు।కాళ్ళ బేరం తప్పదు।"డియర్ ఫ్రెండ్ షర్ పుల్ హక్। నేను అసలే నగలుపోయి ఎవరో దొంగిలించిన నోట్లు నా చేతిలోకి వచ్చి పడి.... ఇరకాటంలో పడి ఏడుస్తుంటే.... ఇంకా నన్ను మరోనాలుగు లక్షలు ఇమ్మ నటం భావ్యమా?"అన్నాడు షర్ పుల్ హక్ చేతులు పట్టుకొని.

అతను సేట్ చేతులు విదిల్చి కొట్టి— "అయితే ఎవరో చేసిన నేరానికి నేను ఉద్యోగం పోగొట్టుకున్నదిగాక పైగా జైలుకి వెళ్ళమనా నీ అర్థం?" అడిగాడు మండి పడి ఫోన్ ఎత్తబోతూ.

సేట్ కి సడన్ గా ఏదో గుర్తొచ్చి "ఆగు। షర్ పుల్ హక్। నేను ఏ పాపం ఎరగననీ తిరుగులేని ఎలిబి—(సాక్ష్యం) నాకుంది. నేను అనుకోకుండా ఆషామాలిని సంభాషణలు నా ఫారిన్ ఫెదర్ టిప్పడ్ టేపు రికార్డులో రికార్డు చేశా. ఆ సాక్ష్యం చాలు. నేను నిర్దోషినని నిరూపించటానికి।" అన్నాడు. తను ఆషామాలిని రావటానికి ఆఫ్ చేయటం మరచిన టేపురికార్డర్ సంగతి గుర్తు చేసుకొని, దానికోసం వెతుకుతూ షర్ పుల్ హక్ ఒక నిముషం బిత్తరపోతూ అలాగే నిలబడి పోయాడు.

కాని టేపురికార్డర్ అక్కడ లేదు। ఆషామాలినే హస్తలాఘవం ప్రదర్శించి వుంటుందా। "ఇక్కడే.... పెట్టాను .... టేపురికార్డర్। ... ఏమైంది।" సేట్ అన్నాడు.షర్ పుక్ వైపు భయంభయంగా చూస్తూ"సేట్। ఇక నాటకాలుఆపు। నన్ను ఇక మరీ ఫూల్ని చేయకు। మొత్తండబ్బు నీకు చేరి వుంటుంది? సరే నాకెందుకు మధ్యలో....।" అంటూ ఫోనెత్తి పోలీస్ స్టేషన్ కు డయల్ చేశాడు.

సేట్ కు పై ప్రాణాలుపైనే పోతుండగా జరగబోయే తంతు వూహించుకొని ఫోను లాక్కొని "డబ్బిస్తాను.... పట్టుకెళ్ళు।" అన్నాడు.

షర్ పుల్ హక్ వెంటనే ఫోనుపెట్టేశాడు. మిగిలిన డబ్బుకోసం। ఆనందయ్య జీవితంలో ఆ క్షణం నుంచి ఆనందం మాయమైంది.

దూరంగా "జగమే మాయ.... బ్రతుకే మాయ...." అనే తెలుగుపాట లీలగా వినిపిస్తోంది.



*